

# ముంజులు

దబ్... దబ్....దబ్....దబ్....!!

బొటన వేలు నడిం వేలుకీ ఉంగరం వేలికీ మధ్యకు వచ్చేట్లు బిగుసుకున్న చంద్రరావు పిడికిళ్ళు విసురుగా దూసుకుంటూ వచ్చి ముక్కూ, మొహం, కన్నూ కడుపూ అన్న భేదం లేకుండా సత్తియ్యను తాకుతున్నాయి.

మట్టి పెళ్ళగిస్తున్న ఉప్పర్లు... 'లమ్మో! లమ్మో!" అంటూ... అల్లంత దూరాన జరుగుతున్న రభసకు చుట్టూ పోగయి పోయారు. నోటిలో వేళ్ళతో, నూలుపోగులేని శరీరాలతో; మట్టిలోంచి పుట్టిన బొమ్మల్లాంటి యింతింతి కుర్రాళ్ళూ... తల మీద చట్టిలతో, చంకలో బిడ్డలతో, రవికల్లేని శరీరాలతో, బిగించి ఎగ గట్టిన చీరలతో, జారిన బొజ్జలతో, పొట్టి మెడలతో, తైల సంస్కారం లేని కొప్పులతో ఆడాళ్ళూ... పొడవుపాటి శరీరాలతో, కాళ్ళ మీద ఉబ్బిన నరాలతో, గోచీ గుడ్డలతో, కాయలు గాసిన చేతులతో, బల్లచెక్కల్లాంటి రొమ్ములతో మగాళ్ళూ... చుట్టూ నిలబడి చూస్తున్నారు.

జరుగుతున్నదాంట్లో అన్యాయమేదో ఉందనే అనిపిస్తోంది.

అనిపిస్తున్నది వేరు! వాళ్ళకి తెలిసింది వేరు!

ఒకడి వస్తువును వాడి అనుమతి లేకుండా ముట్టుకోవటం అన్యాయమే! దొంగతనమే! తప్పే! అయితే అది కొన్నేళ్ళ క్రితం ఒక్కడి వస్తువు కాదు. చుట్టూ నిలబడిన ప్రతివాళ్ళూ యీ రోజు సత్తియ్య చేసిన పనిని ఎందుకో అందుకు ఒకప్పుడు చేసేవారు.

బలంగా లేచిన మోకాలు సూటిగా పోయి సత్తియ్య పొట్టలో నాటింది. 'అమ్మా!' అంటూ రెండు చేతుల్తోనూ పొట్టను పట్టుకుని దబ్బుమని నేల మీద కూలిపోయాడు. పడుతున్నపుడు రేగిన దుమ్ము చంద్రరావు తెల్లటి షరాయి మీద పడింది.

వంగి, దాన్ని దులిపి, లేచి నిలబడి అలుపు తీర్చుకుంటూ అన్నాడు చంద్రరావు.

"తలుపులూ! యియ్యేళ యీడు! రేపు యింకోడు! మనం ఉంటున్న దూరా? అడివా ? కట్టుబాటన్న దుండాలంటావా లేదా? యిదే నా సొమ్మయితే... తప్పుగా యిండి బాబయ్యా

అంటే... పోన్లే! కడుపు కోసం కక్కుర్తి పడ్డాడూ... అని దయ దలవొచ్చు. నువ్వు సెప్పు! మీ గూడెంలో పెద్దవి. ఒకడి సేత సెయ్యోత్తి సూపించుకున్నోడివి గాదు! నలుగురికి సరుదుబాటు సేసి అవుననపించుకున్నాడివి గాని సిన్నోడివి గాదు! యీ నాయాల సేసిం దానికేం సెయ్యాలో సెప్పు!"

తలుపులు మాట్లాడలేదు.

చెప్పమని అడిగే చాలా మంది చెప్పుకొనే అవకాశం యియ్యరు.

"పోలీసుల కప్పగించాల! సున్నంలో కెముక లేకుండా తన్నించాల! మనూరోడూ... రేపూ మాపూ ముకం ముకం జూసుకోవాల్సినోడూ... అనే గందా జోపికడతంట! మళ్ళీ యిలాంటి పని జెయ్యమోకు... నంజ కొడకా!"

చంద్రరావు సత్తియ్యను హెచ్చరించి అక్కడ నుండి కదిలాడు.

"పదండల్లా! పదండల్లా! పళ్ళ గంపలా సూత్తన్నారు."

తలుపులు అందరినీ పనిలోకి తరిమాడు. చంకల్లో పిల్లలను దించారు ఆడాళ్ళు.

చంద్రరావు, పాలికాపు పుల్లిగాడు అందరూ కదిలినా కదల్లేదు. సత్తియ్యకు తగిలిన దెబ్బలకు అతనే సున్నం పట్లు వేయించుకోవాల్సినట్టుంది. ముందుకు అడుగేసి పడున్న సత్తియ్యను లేవదీయబోయాడు. విదిలించుకున్నా వల్లగాక పుల్లిగాడి అసరాతో లేచి నిలబడ్డాడు. మోసినట్టున్న కాలిని జాడించాడు. డొంకల్లో పడిన కత్తినీ, బంధం తాడునీ, కావిడి బద్దనీ ఏరి తెచ్చాడు పుల్లిగాడు.

పడున్న ముంజు గాయల గెలల మీద యిద్దరి చూపులూ కలుసుకున్నాయి. యింకేం ఆలోచించాలనిపించలేదు సత్తియ్యకు. కళ్ళు నులుపుకున్నాడు.

మట్టి పెళ్ళగిస్తున్న గునపాలను పట్టుకున్న చేతుల తాలూకు మెదడులలోనూ... మట్టి నిండిన తట్టలు మోస్తున్న తలకాయల్లోనూ....పుల్లిగాడి ఆసరాతో నడుస్తున్న సత్తియ్యలోనూ... పుల్లిగాడిలోనూ...అందరిలోనూ కొన్నేళ్ళ క్రితం జరిగిన విషయాలే మెదుల్తున్నాయి.

★ ★ ★

ఎక్స్‌ప్రెస్ క్రాసింగ్ ఉండటం వల్ల పాసెంజర్ ట్రైన్ తాళ్ళూరు స్టేషన్‌లో అరగంటకు పైగా ఆగిపోయింది. నిప్పులు చెరుగుతోంది ఎండ! తట్టలో ఉన్న ఆఖరు ముంజుల 'కిమ్మ' అమ్మేసిన సత్తియ్య కంపార్టుమెంటులో ఉన్న పెళ్ళి వారందరి దగ్గరా సెలవు తీసుకొని కిందకి ఉరికాడు.

ఊహించిన దాని కన్న తొందరగా చెల్లుబడయి పోయింది సరుకంతా! చేతిలో పడిన డబ్బులు కూడా రోజూ కన్న హెచ్చే! భయానకమయిన ఎండ పండు వెన్నెలలా ఉందతనికి. అప్పటికప్పుడు పోయి బట్టీ దగ్గర ఓగ్లాసుడు సారా అయినా తాగాలనుంది. మరొక్క గంటలో రెండో పాసెంజరు వస్తుంది. అది దాటితే మర్నాటి మధ్యాహ్నం వరకూ యింకో బండి రాదు. రాత్రి పూట ఆగే బళ్ళలో వ్యాపారం సాగదు. కొంచెం కష్టపడితే సరుకు తీసుకురాగలడు! నాలుగ్గెలలు చాలు!

పరుగులు పెట్టుకుంటూ బార చెరువు వయిపు సాగిపోయాడు. 'అలుగుటయే యెరుంగని...' అంటూ పద్యం అందుకుని పెద్దగా రాగం తీస్తున్నాడు.

తేగలవాడు అనబడే ఆ ప్రాంతంలో తాళ్ళూరు చిన్న పల్లెటూరు. పేరుకి తగ్గట్టుగా ఆ వూరి ఆయకట్టులో తాటి చెట్లు విస్తారంగా ఉన్నాయి. పుంతలకు అటూ యిటూ... బార జెరువు గట్లు మీదా; చెరువు గర్భంలోనూ లెక్కకు మించిన తాటి తోపులున్నాయి. ఆ వూళ్ళో వున్న ఉప్పర్లకి మట్టి పనిలో మంచి పేరుంది. వాళ్ళు వర్షాలు వెనక బడ్డాక పడమట పోయి ప్రాజెక్టు పనిలో కుదిరి, అక్కడ రాతి పని మొదలవటంతోటే వచ్చేస్తారు. పూటకొక జొన్నరొట్టె, పప్పుచారు యిచ్చి ఆఖర్న మగాడి కింత ఆడదాని కింత, యిచ్చే ఏర్పాటు మీద కంట్రాక్టర్లు వాళ్ళని తీసుకుంటారు. మధ్య మధ్యలో వచ్చే జబ్బులకీ... యిళ్ళ దగ్గిర అవసరాలకీ... కంట్రాక్టర్లే అప్పులిస్తారు. వెళ్ళేటప్పుడు వడ్డీలతో సహా యిచ్చిన సొమ్ము తెగగొట్టుకుని మిగిలింది వాళ్ళ చేతిలో పెడుతుంటారు. ఒక్కమారుగా చేతిలో పడిన సొమ్ము - అది ఎంతయినా వాళ్ళకి గొప్పే! మట్టి పనిలో సాధారణంగా ప్రమాదాలుండవు. ఎప్పుడయినా జట్టులో ఎవరయినా ప్రమాదానికి లోనయితే మాత్రం తీరని వెలితిగా ఉంటుంది.

అందరితోనూ సత్తియ్య తిరిగి వస్తున్నప్పుడు ట్రైన్లో జరిగే అనేక రకాల వ్యాపారాలు ఆకర్షించేయి. కదుల్తున్న బండిలోకి ఎక్కుతూ, దిగుతూ రకరకాల వస్తువులను అమ్ముకునే వాళ్ళను చూస్తే ఆశ్చర్యం, ఉత్సాహం కలిగేవి.

అయేడు పుప్పర్లకి పడమటన పనులున్నట్టు వర్తమానం రాలేదు. పల్లెటూళ్ళలో చెరకు తోటలయిపోయాక మడి తిరగేయటానికీ, కాలువలు లోతు చేయటానికీ, భూమి ఎత్తు చేయటానికీ ఉప్పరి పని అవసరమవుతుంది. మెరక ప్రాంతం కావటంవల్లా కొంచెం కరువుగా వుండటం వల్లా, అందరికీ పనులు దొరకటం కష్టంగా ఉంది. కొందరు యువకులు అటూ యిటూ చెదిరి పోయారు. ఆ సమయంలో సత్తియ్య ముంజుకాయల అమ్మకంలోకి దిగాడు. తట్టతో నడుస్తున్న బండిని ఎక్కటంగాని దిగటంగాని అతని కింకా అలవడ లేదు. స్టేషన్లో ఆగినప్పుడే అతను అమ్మేవాడు.

పద్యం పాడుతూ గతం గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తును సుందరంగా ఊహించుకుంటూ చెరువుగట్టు ఎక్కాడు సత్తియ్య. పొద్దుకి అడ్డంగా చేయి పెట్టుకుని తల పైకెత్తి ముదరవాటమూ, లేతవాటమూ లేని కాయల కోసం పరకాయించాడు.

ఎంత తాగినా బిడ్డకి పాలివ్వాలని ఆశించే కన్న తల్లుల్లా నిలబడున్నాయి చెట్లు. ఓ చెట్టు ఎంచుకుని కాళ్ళకి బంధం తగిలించుకుని, మొలనున్న కత్తిని సరిజేసుకొని.... చెట్టు మొదలు రెండు చేతుల్తోనూ పట్టుకుని కళ్ళకు అద్దుకుని.... చక చకా పైకి ఎగబ్రాకాడు.

అటునుంచి పుల్లిగాడు చెట్టెక్కుతున్న సత్తియ్యను చూడగానే గబ గబా అంగలు వేసుకుంటూ వచ్చాడు.

"రొండు మాంచి గెలల్జూడు సత్తియ్యా! రాంబాబు గారిగ్గావాలంట."

"టయింం లేదురా! బండొచ్చేయేలయి పోయింది" అంటూనే రెండు గెలలు నరికాడు సత్తియ్య.

'దబ్! దబ్' మంటూ డొంకలో పడ్డాయి.

"సాల్లేవో! యెప్పుడూ అదేమాటన్నావ్" చొరవగా వెళ్ళి గెలలు ఏరి గట్టు మీద పెట్టి పై నున్న తుండు గుడ్డతో కట్టబోయాడు పుల్లిగాడు.

"ఆటిని ముట్టమాక! ఆ కడవాఁనున్న సెట్టుకి మంచి గెలలున్నాయి! కత్తిస్తా! ఎక్కిదించుకో!" అంటూ అక్కడి నుంచే మరో చెట్టు మీదకు వెళ్ళి పోయాడు సత్తియ్య.

"ఓసోసి! సొంతంలాగే సెపతన్నావురా!" గెలలు భుజాని కెక్కించాడు పుల్లిగాడు.

"నేకపోతే నీ బాబుగోరి ముల్లెను కుంటన్నావంటరా?" పుల్లిగాడి చొరవకు ఒళ్ళు మండింది సత్తియ్యకు. గబ గబా కిందకి దిగి పోయాడు.

"ఎవుడి బాబుగోరిదీగాదు లోవోఁ!" - నవ్వుతూనే ముందుకు అడుగెయ్య బోయాడు, పుల్లిగాడు.

"అలాగంటప్పుడు నేఁ దించుకున్నయ్యి పట్టుకెల్లమని యెపుడు సెప్పాడంట?"

"పట్నం నుంచొచ్చా రబ్బాయిగోరు! మల్లా నేఁ సెట్టెక్కాలంటే బంధం యేసుకోవాల! సెట్టెక్కినోడివి మఁరొండు గెలలు గోసుకోలేవా సొప్పు సత్తియ్యా! అందరూ దినే వోటి నట్టుకెల్లి అమ్ముకుంటన్నావు! ఈ పాటి సాయం చేస్తే తప్పా!"

"ఎవురిగ్గావల్సినవి వాళ్ళు తింటూనే వున్నారు. మిగిలినియ్యే అమ్ముకుంటన్నాను. మాలచ్చిం తల్లులు సల్లగా సూత్తే యీ రెణ్ణెల్లే గందా కడుపు కింత గంజి నీళ్ళు! బండికి టయిం నేదు. అయ్యొగ్గెయ్! కావాలంటే మల్లొచ్చి నీకు, నీ అబ్బాయి గోరికీ దించుతాను."

మాట మీద మాట పెరిగింది. చెయ్యీ చెయ్యీ కలుపు కొనేంత దాకా పోయింది. ఆ సమయానికి ఒంటెద్దు బండి కట్టుకుని ఊళ్ళోంచి అల్లుడికి కాఫీ, టిఫినూ పట్టుకునివస్తున్నాడు చందర్రావు!

యజమాని బండి అపగానే పరిగెత్తుకుంటూ ఎదురెళ్ళాడు పుల్లిగాడు.

"అల్లుడుగోరు ముంజుగాయలు గావాలన్నారండి! యీనా కొడుకుని రొండు గెల లియ్యారా అంటే గీరసవాఁదానా ల్సెపతన్నా డండి! పట్టుకెల్లి రెయిల్లో అమ్ముకుంటాడంట"

సత్తియ్య అందుకున్నాడు.

"తప్పేటన్లేదు బాబయ్యగోరూ! 'మల్లొచ్చిదించుతానూ యియ్యి ముదరియ్యి! ఆ కడవానున్న సెట్టుయ్యి మంచియ్యి! నువ్వెక్కు! కత్తి పట్టుకెల్లరా!' అన్నానండి. టయిమయి పోతుందని గానండీ తవురికన్నా ఎక్కువాండి".

చందర్రావుకి సత్తియ్య మాటల్లో తప్పేం కనుపించలేదు.

"తొత్తు కొడకా! బద్దకం యేపారంగాపోతే నువ్వు సెట్టక్కలేవూ!"

పుల్లయ్యకు కడుపు మండింది.

"యెక్కగల్దునో లేదో! సెట్టు మీదున్న మడిసి గందా అనడిగాను! యెంత యేపార మంతుడయితే మాత్తరం పెద్దంతరం సిన్నంతరం నేకుండా... రాంబోబుగోరూ లేదూ గింబోబు గోరూ లేదూ! యెల్లెల్లవో అంటాడా? జోబీలో గల గల మంటంటే ఎవురయినా కాపడతారేటి నెండి!"

"ఓసోసి! ఎంతోటి పుట్టగింపుల్లెగదీస్తన్నావురా మాలనాకొడకా! ఎవురెలాంటారో పెద్దబ్బాయిగోరికి తెల్దనుకుంటన్నావంట్రా!!"

"మీరిద్దరూ యిలా రండ్రా", బండిని చింతచెట్టు నీడలోకి మళ్ళిస్తూ అన్నాడు చంద్రావు. దూరం నుంచి రైలు కూత!

"పాసెంజర్నాగే ఉంది బాబయ్యా! వచ్చేత్తంది! యింకియ్యేం జేసుకుంటాన్లేరా! పట్టుకెల్లు! పట్టుకెల్లు", సత్తియ్య బండి ననుసరిస్తూ అన్నాడు.

గెలలట్టుకుని నడవమని పుల్లిగాడికి పురమాయించి చంద్రావు చింత చెట్టు కింద బండి ఆపి జేబులోంచి చుట్ట తీసాడు. మొలనున్న గుడ్డ తీసి గాలికి ఆరిపోకుండా అడ్డంగా పట్టుకున్నాడు సత్తియ్య చంద్రావు చుట్ట ముట్టించు కుంటున్నప్పుడు. అతను సరిగ్గా అంటుకుందో లేదో చూసుకుంటున్నప్పుడు బండిలోంచి పైకి వేళ్ళాడుతున్న నాలుగ్గడ్డి పరకలు లాగి ఎద్దు నోటికి అందించి అది నవుల్తుంటే గంగడోలు రాస్తూ నించున్నాడు సత్తియ్య.

"యీ యేపారం మనూళ్ళో ఎంత మంది చేస్తన్నార్రా?"

"ముగ్గురవండి!"

"ఏకాడి కొస్తాదేటీ?"

"వోపిక బాబయ్యా! గెలలు పట్టు కెల్లాలేగాని చెణంలో అయిపోతాయండి."

"ముంజులమ్ముతారా! కాయలా?"

"అయ్యా యియ్యా గూడా సెల్లిపోతాయండి! ముంజొస్తాదంటే తీసేసే అమ్ము కుంటున్నారవండి."

"రోజు కూలి కిట్టు బాటవుద్దా?"

"ఒక్కూలేటి బాబయ్యా?! ఒక్కోసుట్టు పది రూపాయలకు తక్కవుండదండమ్మకం!"

"ముగ్గురికీ వుంటాదా అంత బేరం?"

"అళ్ళకి నాకన్న జబ్బ సత్తవండి! యింకా ఎక్కువే వత్తాదండి"

చచ్చుబేరం పది రూపాయలంటే ముగ్గురికీ ముప్పై.... నెలకీ తొమ్మిదొందలు... యించుమించు మే, జూన్, జూలై... మూణ్ణెల్లకీ మూడు వేలు దగ్గిర దగ్గిర .... కాదంటే రెండు వేలు చులాగ్గా- చంద్రావుకీ లెక్కతేలేసరికి తల తిరిగినట్టయింది.

"మిగిలినోళ్ళిద్దరూ యెవర్రా?" ఎద్దు నదిలిస్తూ అడిగాడు.

బండి వేనకే నడుస్తూ సమాధానం చెప్పాడు సత్తియ్య.

చంద్రావా వూరికి ప్రెసిడెంటు.

"యెల్లెల్లు! పని జూసుకో!"

"సిత్తం బాబయ్యా! దయుంచండి"

చంద్రరావు కళ్ళంలోకి వెళ్ళేసరికి రాంబాబు నాలుక్కాయలు లాగించేసాడు! కొడుకు వీరభద్రం ఆరబెట్టిన నువ్వు జేను తిరిగేయిస్తున్నాడు! యజమానిని చూడగానే పడక్కుర్చీ బోరింగ్ షెడ్డులోంచి తెచ్చాడు పెద్దపాలికాపు యెంకడు.

".... యెలా వున్నా యల్లుడు గోరో!"

"మార్వలెస్! గొప్ప టేస్టీగా ఉన్నాయండి."

విద్యుక్తధర్మంగా అల్లుణ్ణి పకరించి కళ్ళు మూసుకొని ఆలోచిస్తూ కుర్చీలో జారబడ్డాడు.

యేటికేడాదీ వెనకా ముందూ జూసుకోకుండా పెట్టుబడి మీద పెట్టుబడి పెట్టి కలుపు తీయించి, ఎరువులేసి, నీళ్ళమర్చి, అష్టకష్టాలూ పడి వ్యవసాయం జేస్తే... అన్నీ కలిసొస్తే తప్ప పంట చేతి కందదు. అలాంటిది పైసా పెట్టుబడి లేకుండా వస్తున్న పంటను అనుభవిస్తున్నారు వాళ్ళు మారాజు బిడ్డల్లా!

పుండు సలిపినట్లు సలుపు తోందతని బుర్రలో.

పట్నంలో మంచి జోరుగా వ్యాపారం చేస్తున్నాడు రాంబాబు. అతనికి తప్ప చంద్రరావుతో మాట్లాడే ధైర్యం ఆ కుటుంబంలో ఎవరికీ లేదు. అన్నగారు తమ్ముళ్ళకు దైవం! భార్యకు భర్త వీధిలో ఉన్నాడంటేనే గుండెల్లో దడ!

ఆ రాత్రి భోజనాలయాక చంద్రరావు వాకిట్లో కూర్చున్నాడు! అప్పుడే అల్లుడికి తన పథకం వివరించాడు.

పోరంబోకు భూముల్లో చెట్లవి! యింత కాలమూ వూరంతా ఎవరిగ్గావల్సినవి వాళ్ళు తిన్నారు. వాటిని నరుక్కుని పోడానికైతే హక్కు లేదు గాని ఫల సాయం గూర్చి ఎవ్వరూ ప్రశ్నించకపోవటం వలన హక్కుల గొడవ రాలేదు. యీ నాటికి ఆ కాయల్నమ్ముకొని డబ్బులు కూడబెట్టుకునేవారు బయల్దేరారు. వూరందరికీ చెందిందాన్ని ఒక్కళ్ళు తినడం సహించలేక పోతున్నాడు. అందుకని ఖాయిదా పాట పెడతాడు. తనే పాడతాడు. పాట సొమ్ముతో వూరికి గావల్సిన పన్లే చేయిస్తాడు. తనకీ నాల్గురాళ్ళు మిగుల్తాయి! ఊరికీ మంచి జేసిన వాడవుతాడు.

పక పకా నవ్వాడు రాంబాబు.

"ఎందుకండీ నవ్వుతున్నారు?" తెల్లబోయాడు చంద్రరావు.

"మీరు చెయ్యాలనుకునేది వ్యాపారమా? వ్యవసాయమా? జస్ట్ థింక్! ఆలోచించి చెప్పండి."

"వ్యాపా....రమే!"

"ఎగ్జాక్ట్లీ!... దానికీ వ్యవసాయానికీ ఉన్నటువంటి బేధం ఏమిటి?"

చంద్రరావు ఆలోచించాడు.

"మీ పల్లెటూరి ధనవంతులకి... డబ్బుంది! దానిని అభివృద్ధి చెయ్యాలనే... కోరిక.... ఉంటుంది! బట్... విచారించదగ్గ విషయమేంటంటే... బుర్రకాయ లేదు...! అందుకే వ్యాపారంలోకి దిగితే.... చితికి పోతారు.....! మునిగి పోతారు!! లేదూ అంటే... ఉన్న డబ్బుని నేలలో కప్పెట్టి చూసుకుంటూ ఉండిపోతారు."

అల్లుడేమయినా కొత్త వ్యాపారానికి మదుపు కోసం తంటాలు పడుతున్నాడా?? అమ్మాయి మొహం ధుమ ధుమ లాడటం లేదే!!

"మంచేపారం గాదంటారా?"

"వ్యాపారం మంచిదా చెడ్డదా అన్న ప్రశ్నకు జవాబు... దిగాక... వచ్చిన లాభాల బట్టి తెలుతుంది. ఒక విజయవంతమయిన వ్యాపారస్తుడికీ... ఒక భూస్వామికీ... ఓ చిన్న డిఫరెన్సుంది."

"చెప్పండి! చెప్పండి."

"లాండ్ లార్డ్‌కి వర్షం, పదునూ, ధరలూ అన్నీ సహకరించాలి! దేవుడు బాగా చూడాలి. సో! సాధారణంగా అతడేం కోరుకుంటాడంటే... పెట్టుబడి వస్తే చాలని! అదొస్తే తిండి గింజలు సరిపోతే చాలూ అని! అదీ సరిపోతే మరో ఎకరం కొనాలని... లేదా... కూతురి పెళ్ళి చెయ్యాలని! అతను ఒకదాంతర్వాత ఒకటి ఆలోచిస్తాడు... మరియూ... ఆశిస్తాడు. "

"................."

"యింక వ్యాపారస్తుడు! అతడికీ దేవుడి సహకారం అవసరమే! బట్.... అతనికి ధరను పెంచటం, తగ్గించటం.... కొంతలో కొంత చాతనవుతుంది! ధర పెరిగినప్పుడు దాన్ని ఉపయోగించుకోవటమూ... తగ్గినప్పుడూ..... ఉపయోగించుకోటమూ... యిటీజ్ హిజ్ పార్ట్ ఆఫ్ థింకింగ్! అది అతని ఆలోచనలో ఒక భాగం. సో...! అందువల్ల.... పెట్టబడికి వడ్డీ పోనూ... వచ్చేదే.... లాభం అనుకుంటాడు.

"- కనుక వ్యవసాయదారుడికీ... వ్యాపారికీ ప్రాథమికంగా డిఫరెన్సు... ఉంది. అదేంటంటే... వ్యాపారి.... చాలా ఆలోచించాలి! హీ మస్ట్ యైమ్ ఫర్ మోర్! చాలా ఎక్కువ మొత్తాన్ని... దృష్టిలో ఉంచుకోవాలి! అలాంటప్పుడే వ్యాపారం చెయ్యాలి! మీకింకా 'స్పష్టం' చెయ్యాలంటే... తెలివైన వ్యాపారస్తుడు... తక్కువ రిస్క్‌ని తీసుకోవాలి."

"యిందులో లాబం యెక్కువ లేదంటారు....."

"వస్తుందీ... రాదూ... నేనెలా చెప్పగలను? నేనెవణ్ణి చెప్పడానికి."

"అలాగనకండి అల్లుడు గోరూ! మీరు మా కుంటుంబంలో మంచికీ సెడ్డకీ అయినోళ్ళు! మీ ఆలోసనేటో సెప్పండి."

"మీరు వ్యాపారం చెయ్యండి... అయితే ఎక్కువ లాభాలకు ప్లాన్ చెయ్యండి... నష్టం ప్రసక్తి లేకుండా చూసుకోండి."

"నష్ట మెలాగొస్తాదిలెండి!"

"వై? ఎందుకు రాదు? యింతవరకూ.. యీ రోజు వరకూ...ప్రజలు యిష్టం వచ్చినట్లు

తినేదాన్ని తినొద్దంటారు! ఆల్ రైట్!... వాళ్ళు నీతికి కట్టుబడతారు! సరుకుని మీరు ఎలా అమ్ముతారు? దానికి మార్కెట్ లేదు! మీ లాభాల కోసం ప్రజలను కొనమని మీరు 'అభ్యర్థించ' లేరే! సరే...! మనుషుల్ని పెట్టి రైళ్ళలో అమ్మిస్తారు! మార్కెట్లో అమ్మిస్తారు! సరయిన ధరకే అమ్మారని ఎలా తెలుసుకోగలరు? నమ్మకస్తులని పెడతారు. బిజినెస్‌లో... నమ్మకం ఉండాల్సిందే... అదే సమయంలో... ఉండకూడదు కూడా!... మన కింద ఉన్నవాడు మనని ఎంత వరకూ మోసం చెయ్యవచ్చో... మనం మన మీద వాడిని ఎంత వరకూ మోసం చెయ్యవచ్చో... ఖచ్చితంగా అంచనా వెయ్యటమే.... వ్యాపారరీతి! అంతవరకే వాణ్ణి మోసం చెయ్యనియ్యాలి... మనం మోసం చెయ్యాలి... అదే వ్యాపార నీతి!.... అర్థమవుతోందా?"

"చెప్పండి!"

"మీరివన్నీ ఆలోచించాలి... ఆలోచించారా?"

"........................"

"మీరోపని జేయండి! మొదటేడు వేలం వీలయినంత తక్కువకు పాడండి.... మొదట్లో మీదారికి ఎవరూ అడ్డం రారు? యీ వ్యాపారం మీద యింట్రస్టున్న కొందరు పేదాళ్ళనూ... పూర్ బెగ్గర్స్‌ని... పోగు చెయ్యండి! కొంచెం లాభం వేసుకొని... సబ్ కాంట్రాక్ట్‌కి యివ్వండి! లాభనష్టాలు వాళ్ళకే విడిచిపెట్టండి! లాభాలు బాగుంటే... వాళ్ళే ఎగబడతారు! అయితే... ఎంతో మంది మీకులాంటి వాళ్ళే పోటీకి వస్తారు! యిందులో లాభాల్లేవని వాళ్ళకి అర్థమయేట్టు మీరు ప్రచారం చేయగలగాలి! యిందంతా మొదటి రంగం!

"- మార్కెట్ చేయటానికి మీరు చేర దీసిన బెగ్గర్స్... చాలా పద్ధతులు కనుక్కుంటారు. ఫరెగ్జాంపుల్... ముంజుకాయ నీళ్ళు చాలా రుచిగా ఉంటాయి; దానిలో అయిస్ వేసి అమ్మవచ్చు! గుజ్జులో సుగర్ కలపవచ్చు! మిగిలిన కాయలను ఎండబెట్టి వంట చెరకుగా అమ్మవచ్చు! వాళ్ళు మార్కెట్‌కి పునాదులు వేస్తారు! మీరు వాటి మీద మీ యిల్లు కట్టుకోవాలి.... యిది రెండవ రంగం... యీ రంగంలో మీరు విజయం సాధించారనడానికి నిదర్శనంగా జనం మీదగ్గరకు రావటం మొదలవుంది! తోటి వ్యాపారస్థులకు మీతో పోటీ, మీ అవసరమూ ఏర్పడతాయి! ప్రభుత్వంకి యీ వ్యాపారం మీద దృష్టి పడుతుంది! దెనోన్లీ ది రియల్ బిజినెస్ స్టార్ట్స్... అప్పుడే అసలు వ్యాపారం మొదలవుతుంది...."

పల్లెటూరి చంద్రావు పట్నంవాసం రాంబాబు వంక అవాక్కయి పోయి చూస్తూ కూర్చున్నాడు.

"యిప్పటికిది చాలు... పడుకోండి!" ఆఖర్న అన్నాడు రాంబాబు.

మర్నాడు ఊరంతటినీ పిలిపించాడు చంద్రావు.

"సాలా సాలా కాలాల బట్టి యీ వూళ్ళో వున్న మనం... తాటికాయలు తింటన్నాం! ఎవ్వరూ ఎవ్వరికీ అడ్డు సెప్పలేదు. వూరందరికీ సెందిందీ పంట! యియ్యేల... మనూళ్ళో... ఉప్పరి గూడెంలో ముగ్గురు వాటిని అమ్ముకోటం మొదలెట్టారు. ఎవురో ఒకరు దినాల!

బాగుపడాల! కాదన్ను! అవుతే ముగ్గురు ముప్పై మందవుతారు....! ముప్పయ్యిమందిరీ... మూడొందలవుతారు! నాదంటే నాదని తన్నుకోడమవుద్ది... కోరుటు లెక్కడమవుద్ది! వూరి గవురవం గంగ పాలవుద్దీ.

"అంచేత నేఁ సెప్పేదేటంటే... వూరందరికీ సెందిన యీ పంట వూరందరూ అనుబగించేట్టు సెయ్యాల! మడిసికీ సెట్టనో, యిన్ని కాయలనో యేరు పాటు జేసుకోవొచ్చు! అవుతే అలా సెయ్యటం ఎఱ్రిబాగుల పని! అంచేత నేఁ సెప్పేదేటంటే... యీ పంటని మనం వేలం వేద్దాం? ఆ పాట డబ్బు తోటి... మనం మన కోసం ఓగుడి లెగదియ్యొచ్చు! ఓ రోడ్డేయించు కోవచ్చు! పాట యేపాటిలెండని మీరనుకోవచ్చు. అవుతే మొదట్లో సొమ్ము తక్కవుండొచ్చు! అది పెద్దదవదా? పోగుబడదా?

"- అంచేత నేఁ సెప్పేదేటంటే సిన్న మొత్తవయినా పెద్ద మొత్తవే అయినా వూరు వూరంతా గలిసే అనుభగించాల! మనూరి మంచితనం... మనూరి గొప్ప తనం.... మనూరి కట్టుబాటు... అందరికీ.... ఎరికే! ఒకడి సొమ్ము జేసుకునే వోళ్లెవరూ లేరిక్కడ! వుంటే... దేవుడి పేర జేసే యీ పని... గుడి గట్టించాలని జేసే యీ పని... ఒకడి ప్రాణం ఉసూరు మంటే... అణ్ణి బతికి బట్టకట్టనిస్తాదా అంట! మీలో ఎవురికయినా నేఁ జెప్పింది నచ్చపోతే సెప్పండి."

ఏకగ్రీవంగా ప్రెసిడెంటుగారి ప్రపోజులు ఆమోదించబడింది! గుడి కట్టాలన్నారు జనం! దండోరా వేసారు! పాట పెట్టారు! మూడొందలు దేవుడి పాట! మరో పాతిక వేసి ప్రెసిడెంటుగారి అబ్బాయే పాడాడు! అక్కడి కక్కడే ఆ డబ్బుతో గుడికి రాయి దోలించమని వీరభద్రానికే పురమాయించబడింది.

పాట అయిపోయాక జనాన్ని నించోబెట్టి మళ్ళీ చంద్రరావు మనవి జేసాడు.

"మా చంటాడు పాట పాడాడు! అవుతే... మనూర్లో మనం దినకుండా యీ కాయలు... పయికెల్లటానికిల్లేదు! అంచేత నేఁ సెప్పేదేటంటే... మీలో ఎవురికి ఓగెల గావాల్సొచ్చినా నా కాడికి రండి! సెప్పండి! పట్టుకెల్లండి! మీరు నాయఁవనిపించిందివ్వండి (అంటున్నప్పుడు రాంబాబు వయిపు చూసాడు! అతను 'గుడ్' అన్నట్టు నవ్వాడు) - మనూళ్ళో పేదాళ్ళున్నారు - అళ్ళకి తాటి పళ్ళంటే యిష్టం -! బగమంతుడి దయవల్ల నాకు లోటు నేదు -! అందువల్ల - మా వోడు - మా చంటాడు - కాయలకేపాట పాడాడు గనుక - పళ్ళు - తాటి పళ్ళు - ఎవరియ్యాగావు! అయ్యి ఎవురయినా పట్టుకెల్లొచ్చు!"

చంద్రరావుని జనం పొగిడారు! దేవుడన్నారు.

"వేలు అందిస్తే మండ మింగే రకం పల్లెటూరి పెద్దలు" అనుకున్నాడు రాంబాబు.

★ ★ ★

తమ కడుపు కొట్టాడని తిట్టుకుంటున్న ముగ్గురికీ ఆ రాత్రి వేరు వేరుగా వర్తమానం అందింది.

"సత్తియ్యా? నీ యేపారం మీదకి పది మందొచ్చి నిన్ను పడగొట్టకుండా సెయ్యటానిగ్గాపోతే నా కెందుకీ యేపారం? కూడెట్టనా? గుడ్డెట్టనా?"

"సిత్తం!"

మొకాళ్ళ మీద చంద్రావు వాలుకుర్చీ దగ్గరంటా కూర్చున్నాడు ముడుచుకుపోతూ సత్తియ్య.

"నీయిట్టం వచ్చిన కాయలట్టుకెల్లి అమ్ముకో! పదికీ రెండో రెండున్నరో దెచ్చి నాకు పారెయ్! యిరవయి రూపాయలమ్మితే ఆ లెక్కనే కాంతో కూంతో తగ్గించి నాకు పడెయ్! అదీ దేవుడికే గందా! రెయిల్లోనే అమ్మక్కర్లా! కాకినాడ పట్టుకెల్లినా నీ యిట్టమే!"

అయేడు బనీను లేని సత్తియ్య బనీను తొడిగాడు, మొలకి తుండు గుడ్డ మార్చాడు!

★ ★ ★

తరువాతి ఏడు అదే సత్తియ్యతో చంద్రావన్నాడు -

"యీ ఏడాజ్జాసావా! పాటెలా పెంచేసారో!"

"సిత్తం"

"కిట్టుబాటయీ ధర సెపుతాను! సరుకట్టుకెల్లి అమ్ముకురా!"

"సిత్తం"

చిరిగిన బనీను మాసికలు వేయించుకోగలిగాడు ఆ యేడాది సత్తియ్య.

★ ★ ★

తరువాతి ఏడు చంద్రావు అన్నాడు -

"ముందు డబ్బుగట్టి సరుకట్టు కెల్లు!"

"నా కాడేటుంది బాబయ్యా!"

"రెండేళ్ళబట్టి యేపారం జేత్తన్నావు! ఆపాటి యెనకెయ్య లేదా?"

"నేదయ్యా!"

"ఓ పని జెయ్యి! నీ యిల్లు నాకు తాకట్టెట్టు! ఊరికే కాగితం రాస్తావంతే -! డబ్బు గట్టేసాక నీ కాయితం నీకాడుంటాది."

ఏడాదీ తిరగే సరికి మాసిన తుండు కూడా లేకపోయింది సత్తియ్యకు.

★ ★ ★

మూడో ఏడు:

"ముందు డబ్బుగట్టి సరకట్టుకెల్లి నట్టపోయావు! నాకు బాకీ బడ్డవు సత్తియ్యా!"

"సిత్తం"

"యియ్యేడు నేనే మార్కెట్ కట్టుకెల్దారనుకుంటన్నాను. సానా కాలం బట్టి బతికావిందిమీద! ఎంతమందున్నా నువ్వున్న సాట్లేరు -"

"సిత్తం"

"యిట్టవయితే కూలీగా సేరు"

"సిత్తం! సిత్తం!"

పల్లెటూరి బీదవాళ్ళు గోచీ గుడ్డలు వేసుకుని జోళ్ళులేని కాళ్ళతో, తట్టలతో తిరిగి

ముంజలమ్మితే... పట్నం బీదవాళ్ళు చిరిగి పోయిన పాంటులతో, అరిగిపోయిన హవాయి జోళ్ళతో నాలుగు చక్రాల తోపుడు బండి మీద అమ్మారు. వాళ్ళు తట్టలతో చంద్రావు దగ్గర కొనుక్కుంటే... వీళ్ళు చంద్రావు ఏజంటుల దగ్గర పట్నంలో కొనుక్కున్నారు.

వ్యాపారం మెరుగు పడింది.

★ ★ ★

నాలుగో ఏడు....

"కష్టం మల్లటం లేదు బాబయ్యా! మీకీ యేడు నాబాలు బాగుంటాయి! ఓ కూరాకు ఎక్కువ సేయండయ్యా!"

చంద్రావు వింతగా చూసాడు సత్తియ్య వైపు.

"అంటే...?"

"కూలి పెంచండి బాబయ్యా!"

"ఏటిరోయ్! ఎర్రిమాటలాడతున్నావ్! బిజినెస్సు యేపాటి లాభసాటిగా నడుస్తుందో పెట్టుబడెట్టిన్నాకు దెలదంటావా? లేబరోడివి నీకేటి తెలుస్తాది?"

"............"

"సర్నే! కూలి పెంచక పోతే యెల్లిపోతానంటావు."

"నేదు.....నేదు బాబయ్యా! మీ ఉప్పు దిన్నాను! పెరిగాను! యిలా బోనీండి నన్ను!..."

"రేపు కాపడు!"

ఆ రోజే వచ్చిన రాంబాబుతో చెప్పాడు.

"రిమూవ్ హిమ్; తీసెయ్యండి."

"తీసెయ్యడం రైటే అనుకోండి! అవుతే మరోళ్ళకాడకీడెళ్ళడంటారా? మనేపారం గుట్టూ మట్టూ సెప్పడంటారా?"

"లెట్ హిమ్ గో! చెప్పనీండి"

"మరేం... బయం పడక్కర్లేదంటారా?"

"దిస్ బెగ్గర్... ఎవడి వద్దకు వెళ్తాడో.... దట్ జంటిల్మాన్... ఆ పెద్దమనిషి కూడా మనలాటాడే! మనలో మనకెన్ని పోటీలున్నా మనం మనం ఒకటి! ఆ పెద్దమనిషి వీణ్ణి నెత్తి మీద పెట్టుకుంటాడనుకుంటున్నారా? నో! మనం మనం పోటీ పడటం గౌరవనీయం! ఎవరు ఎవర్ని మింగినా... డజంట్ మేటర్... ఫరవాలేదు. యీ కూలి వెధవలకి మాత్రం భయపడ కూడదు! వాళ్ళ గూర్చి పోటీ పడకూడదు. డోంట్ ఫీల్ ప్రిఫరెన్స్ ఫర్ మాన్ పవర్! కూలోళ్ళకు విలువ యివ్వకూడదు."

మర్నాడు పొగ సుఖంగా పీల్చుకోవటానికి అడ్డుపడుతున్న నానిపోయిన చుట్ట కొసను కొరికి తుపుక్కున ఉమ్మాడు చంద్రావు.

"బాబయ్యా! నమ్ముకున్నవోణ్ణన్నాయెం జెయ్యకండి"

"దొంగ లంజాకొడకా ! యేపారంలో నష్టం వస్తుందని సెప్పమంటే నువ్వు జేసిందేటి?"

"అలాగే సెప్పాను బాబయ్యా!"

"అవుతే... పోటీ ఎందుకు పెరగాల?"

కొబ్బరి చెట్టు ఎందుకెక్కావంటే దూడ గడ్డి కన్నాట్టివడో!

"నాకేటి తెల్సు బాబయ్యా"

"యేపారం 'బిగిన్ను'ంచీ నువ్వున్నావ్! నీగ్గాపోతే యెవుడికి దెల్సు?"

"బాబయ్యా! బాయ్యా?" కాళ్ళే వేళ్ళా బడ్డాడు.

"నీ బాబు లాటోళ్ళు నీ కన్నా యిశ్వాసం గలోళ్ళు వందమందొత్తారు! యెల్లెల్లు!"

బయట కొచ్చేశాడు సత్తియ్య.

యీ కాళ్ళతో చెట్టెక్కాడు! యీ రెండు చేతుల్తోనూ గెలలు నరికాడు! యీ భుజాల్తో మోసాడు! లారీలో కెక్కించాడు! బజార్లో అమ్మాడు! డబ్బులు రొంటిన దోపుకుని భద్రంగా పట్టుకొచ్చాడు! చేతిలో పోసాడు!.

కన్న బిడ్డలు తాగాల్సిన పాలు మరెవళ్ళో బజారుకు పట్టుకెళ్ళి పోతుంటే ఏడుస్తున్న తల్లుల్లా కనిపిపించాయి సత్తియ్యకు చెట్లు!

'తల్లీ, భూమాతా! నాకింత గంజి నీళ్ళొయ్యమ్మా!' పైకి చూస్తూ అనుకున్నాడు. అయిదారేళ్ళ బట్టీ పార పని వదిలేసిన చేతులు అలవాటైన చెట్ల వయిపే సాగాయి.

పళ్ళను తినమని చెప్పిన చంద్రరావు పళ్ళు కాకండానే గెలలు దించేసుకుంటున్నాడు. ఎక్కడో మారుమూలున్న చెట్ల మీద గెలలు మాయమవుతున్నట్టు అనుమానం వచ్చింది.

నిఘా వేసారు!

దొరికి పోయాడు సత్తియ్య!

★ ★ ★

చంద్రరావులు ప్రజలు కోసం గుడులు కడుతూనే ఉంటారు. మేడలు కట్టుకుంటూనే ఉంటారు.

ఆ గుడులు వాళ్ళెందుక్కట్టారు?

యీ మేడలెలా కట్టుకున్నారు?

ముంజ కాయల్లాంటి వెన్నెన్నో ఏ మార్గాల ద్వారా ఒక్కడి చేతుల్లోకి పోయాయి?

చెల్లయ్యలూ, సత్తియ్యలూ పావలాకి పది నుంచి పదిహేను ముంజులను తాటాకు 'కిమ్మ'ల్లో కట్టి యిస్తే అందుకున్న ప్రజలే.... 'కిమ్మ' కట్టిన తాటాకుకీ, సైకిలు రిక్షా బండి వాళ్ళకి ప్రభుత్వం అప్పిచ్చి పుచ్చుకుంటున్న వడ్డీకి, రైల్వే ప్లాట్ ఫారం మీద అమ్మడానికిచ్చే లైసెన్సుకీ, మార్కెట్‌లో అనధికార స్థలంలో అమ్ము కొనిచ్చేందుకు యిచ్చే బీటు డబ్బులకీ చంద్రరావుల మేడలనే వగైరా వగైరాలకి పూచీ పడి డబ్బు చెల్లిస్తూ ఒక్కో ముంజా అయిదు పైసలకీ, పది పైసలకీ కొనుక్కుంటూ... ఎలా మోసపోతున్నారు?

తలొంచుకున్న సత్తియ్యకూ, తోటివాడి కోసం బాధ పడుతున్న పుల్లిగాడికీ ఆ ప్రశ్నలూ లేవు.... వాటికి జవాబులూ తెలియవు.

వాళ్ళ వంచబడిన బుర్రల్లో ... ఒక్కప్పుడందరిదీ అయినది మళ్ళీ అందరిదీ చేయాలన్న ఆశయమూ లేదు.

అయినా ఒక డనుభవించేది పది మందికీ చెంది తీరవలసిన అవసరంతో వాళ్ళ పిడికిళ్ళు ధృడంగా బిగుసు కుంటున్నాయి.

ఆ అర్థరాత్రి వేళ వాళ్ళు తలలెత్తి అదనుకోసం చూడటం మొదలయ్యింది. ●

★ *(తెలుగు అమెరికా: జూలై 1979)* ★